సాక్షి చిత్తూరు

బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



నిస్వార్థ సేవకు పురస్కారం

వలంటీర్లు చేస్తున్న నిస్వార్థ సేవలకు ప్రభుత్వం వారికి పురస్కారం అందిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. - 8లో



యువతకు ఉద్యోగావకాశాలు

యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. - 8లో



పేద పడతులకు పెళ్లికానుక

పేదింటి ఆడ బిడ్డలకు పెళ్లి కానుకగా ప్రభుత్వం జిల్లాలో పలువురికి రూ 3.55 కోట్లు విడుదల చేసిందని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. - 8లో

న్యూస్‌రీల్

25న తిరుపతిలో కబడ్డీ జట్ల ఎంపిక

పుంగనూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా పురుషుల కబడ్డీ జట్ల ఎంపికను ఈనెల 25వ తేదీన తిరుపతిలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తిరుపతిలోని తుమ్మలగుంట మైదానంలో ఆరోజు మధ్యాహ్నం 2 గంటలకు పురుషుల జట్టు ఎంపిక జరుగుతుందన్నారు. ఎంపికైన జట్టు మార్చి 8 నుంచి 10 తేదీ వరకు నెల్లూరు జిల్లా కోవూరులో జరిగే 70వ అంతర్‌జిల్లాల పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ ఎంపిక కార్యక్రమానికి క్రీడాకారులు తమ రికార్డులతో హాజరుకావాలన్నారు.

రూ.43.28 కోట్ల నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటి బిల్లులు విడుదల ప్రభుత్వం విడుదల చేసిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,034 బిల్లుల పరంగా రూ.43.28 కోట్లు వచ్చిందన్నారు. ఈ నిధులను ఆన్‌లైన్ చేసి, సంబంధిత వ్యక్తులకు చెల్లిస్తామని చెప్పారు.

నష్టపరిహారం నిధులు విడుదల

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో సంవత్సర కాలంలో ఏనుగుల దాడిలో పంట నష్టపోయిన కుటుంబాలకు రూ.86.92 లక్షలు నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని డీఎఫ్ఓ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పంట, జంతు, మనుషుల ప్రాణాలు నష్టపోయిన వారికి ఈ పరిహారం అందజేస్తామన్నారు. జిల్లాలో మొత్తం 838.78 ఎకరాల పంట నష్టానికి గాను రూ.53.96 లక్షలు, జంతువులు 11 చనిపోగా వాటికి రూ.1.70 లక్షలు, వ్యక్తులు చనిపోయిన వారి కుంటుంబాలకు రూ.30 లక్షలు, గాయపడిన వ్యక్తికి రూ.1.26 లక్షలు అందజేశారన్నారు. మొత్తం 785 కేసులకు గాను రూ.86.92 లక్షలు ఇచ్చారన్నారు. వీటిని త్వరలో మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా మెగా చెక్‌ను అందజేయనున్నట్లు తెలిపారు.

షిఫ్ట్ చాట్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లు షిఫ్ట్ చాట్ యాప్‌ను కచ్చితంగా డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈఓ దేవరాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ షిఫ్ట్ చాట్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ యాప్‌ను టీచర్లందరూ డౌన్‌లోడ్ చేసుకుని బోధిస్తున్న తరగతి, ఏ సబ్జెక్టు బోధిస్తున్నారనే వివరాలను నమోదు చేయాలని డీఈఓ కోరారు.

3న 'పల్స్‌పోలియో'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మార్చి 3 తేదీన పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నామని, దాన్ని విజయవంతం చేయాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ పోలియో వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమం నిర్వహణ పై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, సీఏ విశ్వనాథరెడ్డి పలువురు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించండి



ట్రోఫీని అందజేస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడల్లో విజేతలైన క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో మరిన్ని క్రీడల్లో రాణించాలని జేసీ శ్రీనివాసులు అన్నారు. ఇటీవల రాష్ట్ర స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొని, వాలీబాల్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన బాలుర జట్టు క్రీడాకారులు మంగళవారం జేసీని కలిశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విశాఖలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొని ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించిందన్నారు. జిల్లాలోని గుడిపాల మండలం కొత్తపల్లెకు చెందిన యువకులు రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ పోటీల్లో మూడో బహుమతి సాధించడం గర్వకారణమని తెలిపారు. అనంతరం ఆ క్రీడాకారులకు ట్రోఫీ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ, క్రీడాకారులు గోపి, సూర్య, సుజిత్, దిలీప్, సతీష్, కార్తీక్ ,తంబు, విమల్ రాజ్, రామన్, నందకుమార్, నవీన్ పాల్గొన్నారు.

రెక్కాడితే కానీ డొక్కాడని బడుగు బతుకులు .. ఏళ్ల తరబడి మగ్గం నేస్తూ వెన్ను కుంగిన జీవితాలు.. రాత్రింబవళ్లు పనిచేసినా నోట్లోకి నాలుగు వేళ్లు వెళ్లలేని పరిస్థితులు. దిక్కు తోచక కొట్టుమిట్టాడుతున్న నేత కార్మికుల్లో 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అనే మాట ఎనలేని ధైర్యం నింపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టిన 'వైఎస్సార్ నేతన్న నేస్తం'.. ఛిద్రమైన చేనేత పరిశ్రమలోకి సంక్షేమ వెలుగులు తీసుకువచ్చింది. ఈ పథకం కింద ప్రభుత్వం ఏటా రూ.24వేలు అందిస్తూ వారి జీవన ప్రమాణాలు.. స్థితిగతులను గణనీయంగా మెరుగుపరిచింది.

ఇది కదా.. అభివృద్ధి



వెంకటగిరిలో చేనేత కార్మికుడితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి (ఫైల్)

చిత్తూరు జిల్లా సమాచారం

నేత కార్మికులు	12,00
సొంత మగ్గాలు ఉన్న వారు	325
చేనేత సొసైటీలు	10
చేనేత వృద్ధాప్య పింఛన్‌దారులు	3,263

నేతన్న నేస్తం కింద చిత్తూరు జిల్లా సమాచారం

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించిన సాయం (రూ.లక్షల్లో)
2019-20	199	47.00
2020-21	217	52.00
2021-22	153	36.00
2022-23	166	39.00
2023-24	194	46.00

నేనున్నాను నేస్తం

- కుదేలైన చేనేత బతుకుల్లో సంక్షేమ వెలుగులు
- 'వైఎస్సార్ నేతన్న నేస్తం'తో మారిన తల రాతలు
- ప్రభుత్వ చేయూతతో తీరిన సమస్యలు
- రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్న నేత కార్మికులు
- ఆర్థికంగా పుంజుకున్న బడుగు జీవితాలు

సాక్షి, తిరుపతి డెస్క్ : నేత కార్మికులు ఇంటిల్లిపాది పనిచేసినా షావుకారుల వద్ద తెచ్చుకున్న ముడి సరుకులు, కుటుంబ అవసరాలకు సరిపోయేది కాదు. చేనేత రంగంలో ఆధునికతను అందిపుచ్చుకోలేక.. మగ్గాలను వదిలి వేరే వృత్తి చేసుకోలేక వారి జీవితం దుర్భరంగా ఉండేది. ఈ క్రమంలో చేనేతల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం రూపొందించారు. నెలకు రూ.2 వేలు చొప్పున సంవత్సరానికి రూ.24వేలు అందించాలని నిర్ణయించారు. ఆ మొత్తాన్ని ఒకేసారి లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చారు. ఈ ఆర్థిక సాయం నేతన్నలకు ఎంతగానో ప్రోత్సాహం అందించింది. అరకొర ఆదాయంతో జీవించే కార్మికులకు నేతన్ననేస్తం నగదు ఆపద్బంధువులా పనిచేసింది. ఈ సొమ్ముతో చేనేత కార్మికులు తమ మగ్గాలను ఆధునీకరించుకోవడం, మిషన్‌లను అమర్చి పనులు వేగవంతం చేసే దిశగా అడుగులు ముందుకు వేశారు. విద్యుత్ మోటార్ల సహాయంతో సులువైన రీతిలో త్వరగా పనులు పూర్తి చేసుకుంటూ రాణిస్తున్నారు. మరి కొందరు కార్మికులు సొంతంగా పడుగు, పేకా, జరీ కొనుగోలు చేసుకుని తాము నేసిన చీరలను మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకునే పరిస్థితికి ఎదిగారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తమ బతుకులు మెరుగుపడ్డాయని పలువురు చేనేత కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముడి సరుకులు తెచ్చుకుంటున్నాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని ఏటా రూ. 24వేలు మా ఖాతాల్లో జమ అవుతోంది. నేతన్న నేస్తం కింద అందిన ఈ నగదుతో మగ్గాలకు కావాల్సిన పట్టు, జరి, నూలు వంటి ముడి సరుకులు తెచ్చుకుంటున్నాం. గత 35 ఏళ్ల నుంచి ఇదే వృత్తిలో కొనసాగుతున్నాం. ఎప్పుడూ ఏ ప్రభుత్వం చేయలేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాలాంటి నేత కార్మికులకు సాయం అందిస్తోంది. జగనన్న తోడ్పాటుతోనే మా బిడ్డలను ఉన్నతంగా చదివించుకోగలుగుతున్నాం.

– బొడిచెర్ల హైమావతి, చేనేత కార్మికురాలు, ఎన్టీఆర్‌కాలనీ, వెంకటగిరి

బతుకులు మారాయి



మా తాత, తండ్రి కాలం నుంచి చేనేత మగ్గాలనే జీవనాధారం చేసుకుని పొట్ట పోసుకుంటున్నాం. గతంలో చేనేతలను ఎవరూ ఆదుకున్న దాఖలాలు లేవు. షావుకారుల వద్ద ముడి సరుకులు తెచ్చుకోవడమే కాకుండా, చీర నేసే సమయంలో పడుగు, పేకా తగ్గితే సొంత నగదు వెచ్చించి చీరను పూర్తి చేసేవాళ్లం. షావుకారు ఇచ్చే కూలి సరిపోక కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేనేతలకు ఏటా రూ. 24వేలు నగదు ఇవ్వడంతోపాటు మరిన్ని ప్రోత్సాహకాలను అందిస్తున్నారు. ఈ నగదుతో సొంతంగా ముడి సరుకులు కొనుగోలు చేసి, ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాం.

– బొడిచెర్ల సుబ్బయ్య, చేనేత కార్మికుడు, ఎన్టీఆర్‌కాలనీ, వెంకటగిరి

విప్లవాత్మకమైన మార్పులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ నేతన్న నేస్తం చేనేత పథకం ద్వారా సకాలంలో నిధులు ఖాతాల్లోకి వస్తుండడంతో చేనేత పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. చాలా మంది నేత కార్మికులు ఈ నిధులు సద్వినియోగం చేసుకొని సొంతంగా మగ్గాలు నేసుకుంటూ రాణిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్‌లో చేనేత వస్త్రాలకు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో వ్యాపారాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీంతో చేనేతల జీవితాలు గతంలో కంటే ప్రస్తుతం మెరుగ్గా ఉంటున్నాయి. మాలాంటి పేదల బతుకులకు సాయం చేస్తున్న జగనన్న మేలును జీవితంలో మరువలేం.

– చీకవోలు సుధాకర్, చేనేత కార్మికుడు, సాలికాలనీ వెంకటగిరి

మేలు జరిగింది



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకంలో వచ్చిన ఆర్థిక సాయంతో వృత్తిని మెరుగుపరచుకున్నా. చాలీచాలని ఆదాయంతో సతమతమయ్యే సమయంలో ఈ పథకం ఎంతో ఉపయోగపడింది. గతంలో ఐదు విడతల్లో రూ.1.20 లక్షలు నాకు అందింది. ఈ సాయంతో లిఫ్టింగ్ యంత్రం కొనుగోలు చేసుకున్నా. ఇదివరకు పట్టు చీర నేయడానికి 5 రోజులు పట్టేది. ప్రస్తుతం 3 రోజుల్లో చీర నేయడం పూర్తవుతోంది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో నాకు ఎంతో మేలు జరిగింది. పేదలకు అండగా నిలుస్తున్న జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– మోహన్, చేనేత కార్మికుడు, మాంగాడు, నగరి మండలం

నిలదొక్కుకున్నా



ఎలాంటి సిఫారసులు లేకుండా అర్హతే ఆధారంగా నాకు వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం అందుతోంది. నూలు తెచ్చుకోలేని దుస్థితిలో ఉన్న రోజుల్లో ఈ పథకం నన్ను ఆదుకుంది. ప్రస్తుతం ఐదు విడతల్లో వచ్చిన ఆర్థిక సాయంతో వృత్తిలో నిలదొక్కుకున్నా. పెద్దసంఖ్యలో డిజైన్లు ఇచ్చే పనిముట్లు, బాబిన్లు కొనుగోలు చేసుకున్నా. కొత్త డిజైన్లతో ఖరీఫ్‌లు నేస్తున్నా. ఫెడల్ లూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా. మా కుటుంబ జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి అంటే అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణం.

– పి. కస్తూరి, నేత కార్మికురాలు, మాంగాడు, నగరి మండలం

ఆదుకుంటోంది



నేతన్న నేస్తం పథకం ఆపద్బంధువులా సకాలంలో ఆదుకుంటోంది. గతంలో నేత పనులు సాగితేనే జీవనధారం ఉండేది. అదీ షావుకారు ఇచ్చే అరకొర కూలి డబ్బులతో ఓ పూట తింటూ.. మరో పూట పస్తుండాల్సిన పరిస్థితి. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా అందిస్తున్న రూ.24వేలతో మా పరిస్థితి మెరుగుపడింది. వర్షాలు కురిసే సమయంలో ఒకప్పుడు పనులు సాగేవి కావు. అప్పుడు కుటుంబ పోషణ కూడా కష్టంగా ఉండేది. ప్రభుత్వం అందిస్తున్న భరోసాతో మాకు ఇబ్బందులు తప్పాయి.

– జింగా వెంకటలక్ష్మి, చేనేత కార్మికురాలు, సాలి కాలనీ, వెంకటగిరి

అండగా నిలుస్తోంది



గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వలేనంత భరోసాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారు. పూట గడిచేందుకే కష్టమైన కోవిడ్ సమయంలో సైతం ప్రభుత్వం సాయం అందించింది. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ అండగా నిలుస్తోంది. మాకు నేతన్ననేస్తం పథకమేకాకుండా అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ ఆసరా, సున్నావడ్డీ వంటి ఎన్నో పథకాల ద్వారా లబ్ధి చేకూర్చింది. రెక్కాడితే కానీ డొక్కాడని మాలాంటి పేదలకు ఇంతగా చేయూతనందిస్తున్న జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పింజల వీరయ్య, చేనేత కార్మికుడు, బంగారుపేట, వెంకటగిరి

యంత్రాలు అమర్చుకున్నా



నేతన్న నేస్తం నిధులను ప్రభుత్వం సకాలంలో అందించడంతో సులభతరంగా పనులు సాగే దిశగా మా మగ్గానికి యంత్రాలను అమర్చుకున్నా. గతంలో నేత పనుల కంటే ఈ యంత్రాల సాయంతో పనులు సాఫీగా సాగిపోవడంతోపాటు తక్కువ సమయంలో అనుకున్న లక్ష్యాలను చేరుకుంటున్నాం. దీంతో ఆర్థిక ఉపశమనం లభించింది. ఈ స్థాయిలో ఏ ప్రభుత్వమూ చేనేత కార్మికులను ఆదుకోలేదు. ఏటా అందిస్తున్న రూ.24 వేల నగదు మాకు ఎంతో విలువైంది. ఇచ్చిన మాట ప్రకారం అండగా నిలుస్తున్న సీఎం జగనన్న మేలు ఎన్నటికీ మరువలేం.

– పీ రవి, చేనేత కార్మికుడు, బంగారుపేట, వెంకటగిరి

సీఎం పర్యటనను విజయవంతం చేయండి





సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సభా స్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి, జిల్లా కలెక్టర్, నాయకులు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు
- ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి

శాంతిపురం: కుప్పంలో ఈ నెల 26న జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ వనరుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ జాషువా, ఎమ్మెల్సీ భరత్, సీఎం పర్యటనల సలహాదారు తలశిల రఘురామ్‌తో కలిసి రామకుప్పం, శాంతిపురం మండలాల్లో సీఎం పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. రామకుప్పం మండలం రాజుపేట వద్ద హెలీప్యాడ్, కుప్పం కెనాల్ కాలువను చూశారు. శాంతిపురం మండలంలోని మఠం వద్ద హెలీప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడే మంత్రి మీడియాతో మాట్లాడుతూ కుప్పం కెనాల్ పనులు కొంత ఆలస్యం కావడం, వేసవి రావడంతో ఇబ్బందిగా ఉన్నా నీరు తెస్తున్నామన్నారు. 14 ఏళ్లు సీఎంగా నీరు తేలేక పోయిన చంద్రబాబు, ఆయన పార్టీ ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని చెప్పారు. కుప్పంలో ఇప్పటికే రెండు చోట్ల రాజన్న క్యాంటిన్ ద్వారా నిత్యం వేల మందికి ఉదయం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నామన్నారు.

నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం

కుప్పం ప్రాంత ప్రజలు తరచూ ఎదుర్కొంటున్న నీటి కష్టాలకు హంద్రీనీవా కాలువ నీటితో శాశ్వత పరిష్కారం దొరుకుతుందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. శాంతిపురంలోని ఓ ప్రైవేటు కల్యాణ మంటపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ 35 ఏళ్లుగా కుప్పానికి ప్రాతినిధ్యం వహిస్తున్న చంద్రబాబు చేయలేని పనిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పూర్తి చేశారని చెప్పారు. సీఎంగా పని చేసిన బాబు సొంత జిల్లాకే కాక కుప్పానికి కూడా నీరు ఇవ్వలేక పోయారన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి పైపులైన్ల ద్వారా నీటిని తీసుకువచ్చే పనులు 70 శాతానికి పూగా పూర్తి అయ్యాయన్నారు. ఇది పూర్తి చేస్తే కుప్పానికి నదీ జలాలు తీసుకురావడం మరింత సులువు అవుతుందన్నారు. అసంపూర్తిగా ఉన్న కాలువ పనులు, ఎత్తిపోతల యూనిట్లు పూర్తి చేసి, కర్నూలు నుంచి నీటిని తెస్తున్నామన్నారు. కానీ ఈనాడు పత్రిక మాత్రం నీరు తేవడానికి ఆపసోపాలు పడుతున్నారని, నీరు రావడం లేదని రాసిందన్నారు. మీడియా వాస్తవాలను చూసి, వాస్తవాలను చెప్పాలని కోరారు. కుప్పం నియోజకవర్గంలోని పరమసముద్రంతో పాటు 56 చెరువులకు నేరుగా కాలువ ద్వారా నీటిని విడుదల చేయడానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా రామకుప్పం మండలం రాజుపేట, లేదా శాంతిపురం మండలం గుండిశెట్టిపల్లె వద్ద హంద్రీనీవా నీటికి పూజలు చేసి, విడుదల చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా, డీఆర్‌డీఏ, హౌసింగ్ పీడీలు రాజశేఖర్, తులసి, పద్మనాభం, హంద్రీనీవా ఎస్ఈ రాజగోపాల్, పార్టీ కన్వీనర్లు బుల్లెట్ దండపాణి, బాబురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా పది, ఇంటర్ పరీక్షలు

- పరీక్ష కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించండి
- డీఆర్వో పుల్లయ్య

చిత్తూరు కలెక్టరేట్ : పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో పుల్లయ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం ఇంటర్ పరీక్షలు మార్చి ఒకటి నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులందరూ సమన్వయంతో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షలకు మొత్తం 32,757 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. జనరల్‌లో 28,225 మంది, ఒకేషనల్‌లో 4,532 మంది పరీక్షలు రాయనున్నారన్నారు. జనరల్ ఇంటర్‌లో మొదటి సంవత్సరం 15,905 మంది, రెండో సంవత్సరం 16,852 మంది పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు 50 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ కళాశాలలో ప్రశ్నపత్రాలు జారీ చేస్తామని తెలిపారు. మొదటిసారిగా జిల్లా కేంద్రంలోని పీసీఆర్ కళాశాలలో ప్రశ్నపత్రాలు బల్క్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆ బల్క్ సెంటర్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

18 నుంచి పది పబ్లిక్ పరీక్షలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఆర్వో తెలిపారు. పది పబ్లిక్ పరీక్షలకు 116 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పది పబ్లిక్ పరీక్షలను అత్యంత కట్టుదిట్టంగా నిర్వహించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకునేలా అన్ని ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. స్క్వాడ్ ఏర్పాటు పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. సకాలంలో ప్రశ్నపత్రాలను ఇతర ప్రాంతాలకు చేరవేసేందుకు పోస్టల్ శాఖ కృషి చేయాలన్నారు. ఇందుకు తగిన వాహనాలను రవాణా శాఖ అధికారులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో మొత్తం 22,594 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ప్రశ్నపత్రాలు భద్రపరిచే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రాజశేఖర్, డీఈఓ దేవరాజు, ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్‌మౌలా, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్ గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో పుల్లయ్య

క్లుప్తంగా

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విధులు కేటాయించిన అధికారులందరూ ఎన్నికల ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, పాలిచ్చే తల్లులు, గర్భిణులు, ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. మినహాయింపులకు దరఖాస్తు చేసుకున్న వారి అర్జీలను కమిటీ సభ్యులు పరిశీలించారు.

పనులు వేగవంతం చేయండి

జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా కోర్టు భవన నిర్మాణ పనులను మార్చి 2వ తేదీ లోపు పూర్తి చేసి అప్పగించాలన్నారు. డీఆర్వో పుల్ల య్య, డ్వామా పీడీ రాజశేఖర్, ఎస్‌డీసీ శివయ్య, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మునీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎంపీ మిథున్



ఇంద్రకీలాద్రి(విజయవాడ): లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా మంగళవారం విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. అలాగే కృష్ణా జిల్లా మోపిదేవిలోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

యువతకు ఉద్యోగావకాశాలు



జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు



ఉద్యోగాలు పొందిన వారితో వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

- రీజినల్ జాబ్‌మేళాకు విశేష స్పందన
- పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన అభ్యర్థులు
- జాబ్‌మేళాను ప్రారంభించిన వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : గతంలో ఎన్నడూ లేని విధంగా అధిక సంఖ్యలో యువతకు ఉద్యోగావకాశాలు కల్పించినట్లు వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ సీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాలలో రీజినల్ జాబ్ మేళా నిర్వహించారు. విజయానందరెడ్డి ఈ మేళాను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ మేళాలో పేరు పొందిన 110 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన యువత నుంచి దరఖాస్తులు స్వీకరించిన పలు కంపెనీలు వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాయి. మేళాలో అతిథిగా పాల్గొన్న విజయానందరెడ్డి మాట్లాడుతూ పదో తరగతి నుంచి ఉన్నత కోర్సులు చదివిన అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. అభ్యర్థుల అర్హత ఆధారంగా వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జనరల్ మేనేజర్ భారతి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి బహుళ జాతీయ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగాలు పొందిన యువత మంచి జీతంతో స్థిరపడుతున్నారని ఆమె తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి గుణశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువతకు ఉద్యోగ అవకాశాలను మెండుగా కల్పిస్తున్నామని తెలిపారు.

విశేష స్పందన

రీజినల్ జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు జిల్లాల నుంచి వేలాది మంది యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొన్నారు. దీంతో ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి, అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జాబ్‌మేళాలో 3,862 మంది పాల్గొనగా, 1,667 మందికి వివిధ కేడర్లలో 110 కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు విజయానందరెడ్డి చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేశారు. ఈ జాబ్‌మేళాలో ఎస్వీ సెట్ ప్రిన్సిపల్ మోహన్‌బాబు, రీజినల్ కో ఆర్డినేటర్ శ్యామ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకు పురస్కారం



వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధర నెల్లూరు: వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు చేస్తున్న నిస్వార్థ సేవలను గుర్తించి, వారి సేవలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ పురస్కారం అందిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అనిత ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు చాలా బలమైన పాత్ర పోషిస్తున్నారన్నారు. వలంటీర్లను సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర, అవార్డులతో సన్మానించడం సంతోషదాయకమని అన్నారు. పేదవారి గుండెల్లో గుడి కట్టుకున్న ఏకైక నాయకుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ముని రాజారెడ్డి, పెనుమూరు ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ చిన్నమ్మ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు ఏకాంబరం, ఏఎంసీ వైస్ చైర్మన్ వేలు మొదలియార్, నేతలు బలరామరెడ్డి, సురేందర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒకచేతిలో డిగ్రీ పట్టా..మరోచేతిలో ఉద్యోగం

- ఘనంగా పీవీకేఎన్ కళాశాలలో రెండో స్నాతకోత్సవం
- విద్యార్థులకు పట్టాల అందజేత



డిగ్రీ పట్టాలు అందజేస్తున్న ఉన్నతాధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఒక చేతిలో పట్టా, మరో చేతిలో ఉద్యోగం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రెండో స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న అతిథులకు ఆ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం సభ్యులు గౌరవ వందనం పలికారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ కొత్త స్కిల్ డెవలప్‌మెంట్, రీసెర్చ్, ఉపాధి కోర్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనకు కేంద్ర బిందువుగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో అనేక సంస్కరణలు చేసిందని తెలిపారు. విద్యార్థులు పట్టుదలతో ముందుకు సాగితే లక్ష్యం చేరుకోవడం సులభమని తెలిపారు. ఎస్వీయూ వైస్ చాన్సలర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యలో నిరంతరం సంస్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రిన్సిపల్ జీవనజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కళాశాల నిరంతరం అనేక కోర్సులను ప్రవేశపెడుతోందన్నారు. అనంతరం డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమం పూర్తి కాగానే డిగ్రీలు పొందిన విద్యార్థులు స్నేహితులతో ఆనందంగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుని సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్య వైఎస్సార్ కడప ఆర్జేడీ బాబు, మంగళగిరి సీసీఈ ఏజీఓ తులసి, ఎస్వీయూ సీఈ దామ్లానాయక్, వైస్ ప్రిన్సిపల్ మీరాసాహేబ్, అధ్యాపకుడు గోపీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు కాదు.. బ్రాండ్ అంబాసిడర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: వలంటీర్లు బాధ్యతతో కాకుండా సేవాభావంతో ప్రజలకు సేవలందిస్తున్నారని, వారు వలంటీర్లు కాదని, బ్రాండ్ అంబాసిడర్లని ఎమ్మెల్యే వెంకటేగౌడ కొనియాడారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వలంటీర్లకు సేవామిత్ర, సేవారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ఏపీ ప్రభుత్వం ఏటా వారిని సత్కరిస్తున్నట్లు చెప్పారు. అవినీతికి తావు లేకుండా పింఛన్ల పంపిణీ, హాజరుయాప్‌ల వినియోగం, నవరత్నాల అమలు, రేషన్ డోర్ డెలివరీ, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇళ్ల పట్టాల పంపిణీ తదితర కార్యక్రమాల అమలు చేస్తున్న తీరే ప్రామాణికంగా అవార్డులకు ఎంపిక చేసినట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యువరాజు, వైస్ ఎంపీపీ లక్ష్మణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బాలగురునాథ్, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌ఏ గౌస్, సింగిల్ విండో చైర్మన్ గోపీరెడ్డి, నాయకులు మురళి, ఇంద్రేష్, కుమార్‌రాజా, హరినాథ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవు



ఫారమ్‌లో కోళ్లను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖాధికారి రవికుమార్

పుత్తూరు: జిల్లాలో బర్డ్ ఫ్లూ లక్షణాలు లేవని జిల్లా పశుసంవర్ధక అధికారి ఏ. రవికుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పుత్తూరు మండలంలోని తడుకు, వేణుగోపాలపురం, తొరూరు, తిరుమల కుప్పం గ్రామాల్లో పర్యటించి పెరటికోళ్లు, పౌల్ట్రీ ఫారాలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బర్డ్ ఫ్లూ వ్యాపిస్తోందని వస్తున్న వార్తల నేపథ్యంలో పుత్తూరు మండలంలోని కోళ్లకు అలాంటి లక్షణాలు లేవని నిర్ధారించారు. మండలంలోని కోళ్ల ఆరోగ్య విషయంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు స్థానికంగా రెండు ఆర్‌ఆర్‌టీ టీములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు బర్డ్ ఫ్లూ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, మన జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపసంచాలకులు డాక్టర్ డి.ఉమామహేశ్వరి, పుత్తూరు సహాయ సంచాలకులు డాక్టర్ జి.గురునాథ్, పరమేశ్వరమంగళం పశువైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ కె.ప్రసూన, డాక్టర్ ఎస్.శ్రీదేవి పాల్గొన్నారు.

నా భర్త ఆచూకీ గుర్తించండి



మాట్లాడుతున్న శ్రీదేవి

చిత్తూరు రూరల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భర్తకు పోలీసు శాఖలో హోంగార్డు ఉద్యోగం వచ్చిన తర్వాత తనను వదిలేశాడని, ఆరు నెలల నుంచి అతని ఆచూకీ కోసం తిరుగుతున్నానని, ఆయన ఆచూకీ గుర్తించాలని శ్రీదేవి అన్నారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తాము తిరుపతి జిల్లా పుత్తూరులో నివాసం ఉంటున్నామని చెప్పారు. పుత్తూరులోని ఓ డిగ్రీ కళాశాలలో ఇద్దరం పనిచేస్తున్న సమయంలో.. ప్రేమిస్తున్నానని చెప్పి రామచంద్రన్ తనను 2021లో పెళ్లి చేసుకున్నాడని పేర్కొన్నారు. అనంతరం తన భర్తకు పోలీసు శాఖలో హోంగార్డు ఉద్యోగం వచ్చిందని, అప్పటి నుంచి తనను వదిలేశాడని, ఆరు నెలల నుంచి అతని ఆచూకీ కోసం తిరుగుతున్నానని తెలిపారు. దీనిపై ఉమ్మడి జిల్లాలో పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసేందుకు తాను చేసిన ప్రయత్నాలను అతని కుటుంబ సభ్యులు అడ్డుకున్నారని ఆరోపించారు. తన ప్రాణానికి తన భర్త కుటుంబ సభ్యుల నుంచి ముప్పు ఉందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, తన భర్త ఆచూకీ తెలిపి అతనితో తనని కలిపి, తనకు న్యాయం చేయాలని ఆమె కన్నీళ్ల పర్యంతం అయ్యారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐ రవిశంకర్ రెడ్డి

తవణంపల్లె: కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రూ.1.06 లక్షల విలువైన 1,680 టెట్రా ప్యాకెట్లు, మారుతీ సుజికి స్విఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నట్లు చిత్తూరు డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి వెల్లడించారు. డీఎస్పీ కథనం మేరకు.. సోమవారం మండలంలోని కాణిపాకం సమీపంలోని చిత్తూరు– బెంగళూరు హైవేలో ముందస్తు సమాచారం మేరకు చిత్తూరు రూరల్ సీఐ రవిశంకర్ రెడ్డి, తవణంపల్లె ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి, చిత్తూరు క్రైమ్ పోలీసులు, తమ సిబ్బందితో కలసి వాహనాలు తనిఖీ చేపట్టారు. హైవేలో వచ్చిన కేఏ 05 ఎన్‌జే 5937 కారును తనిఖీ చేయగా కారులో 1680 టెట్రా ప్యాకెట్లు, సుమారు 302 లీటర్ల మద్యం ఉండగా గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యం విలువ రూ.1,06,075 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. ఈ కేసులో గుడిపాల మండలం వెప్పాలచేను గ్రామానికి చెందిన ఎ.ఉదయకుమార్(27)ను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో నిందితులు తాళంబేడుకు చెందిన గణేష్, ముళబాగల్‌కు చెందిన విగ్నేష్‌లు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.

పేద పడతులకు పెళ్లికానుక

- వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా నిధుల విడుదల
- 437 మందికి రూ.3.55 కోట్ల జమ
- కలెక్టర్ షణ్మోహన్



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, నాయకులు

శాంతిపురం: పేదింటి ఆడ బిడ్డలకు పెళ్లి కానుకగా ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాల ద్వారా జిల్లాలోని 437 మందికి రూ 3.55 కోట్లు విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు విడుదల కార్యక్రమాన్ని శాంతిపురం రెవెన్యూ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులుతో కలసి వీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2023 అక్టోబర్– డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి లబ్ధిదారులకు వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ అవుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, విభిన్న ప్రతిభావంతులు, భవన నిర్మాణ కార్మికుల ఆడ పిల్లలను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ఇప్పటికే నాలుగు త్రైమాసికాలకు సంబంధించి 1,511 మంది లబ్ధిదారులకు రూ.11.96 కోట్లు అందించిందన్నారు. ప్రస్తుతం రూ 3.55 కోట్లు విడుదల చేసిందని, మొత్తం 1,948 మందికి రూ.15.51 కోట్లను అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ తులసి, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ శాఖల అధికారులు రాజ్యలక్ష్మి, రబ్బానీబాషా, రాష్ట్ర వన్ని కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్ పర్సన్ వనిత, ఐసీడీఎస్ జోనల్ చైర్ పర్సన్ శైలజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి పాల్గొన్నారు. కల్యాణమస్తు, షాదీతోఫా అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వారి సంతోషం వారి మాటల్లోనే..

మా కుటుంబాన్ని ఆదుకున్నారు



పేదింట పుట్టిన నాకు శ్రీనివాసులుతో ఐదు నెలల క్రితం వివాహమైంది. వలంటీరు సాయంతో వైఎస్సార్ కల్యాణమస్తు కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఈ పథకం కింద మాకు రూ.50 వేలు మంజూరైంది. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన అనేక పథకాలతో ఇప్పటికే మాకు మేలు జరిగింది. మా అమ్మకు డ్వాక్రా రుణం మాఫీ కావడంతో నాలుగు విడతలుగా ఆసరా నిధులు మా అమ్మ బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయి. ఇప్పుడు కల్యాణమస్తు నిధులు వచ్చాయి.

-లావణ్య, తిమ్మరాజుపల్లె

పెళ్లి అప్పులు తీరాయి



వర్షాధారంగా పండే భూమి కొంత మాత్రమే ఉండడంతో వ్యవసాయ కూలీ పనులు చేసుకుని జీవిస్తున్నాం. ఈ స్థితిలో మా కుటుంబం నా పెళ్లికి అప్పులు చేయక తప్పలేదు. కానీ వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా మా అమ్మ అకౌంట్‌కు రూ.లక్ష జమ అయ్యింది. దీంతో మా తల్లిదండ్రుల అప్పులు చాలా వరకూ తీరిపోతాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నా పెద్ద అన్నయ్యగా బాధ్యత తీసుకుని, నాకు వివాహం జరిపించడం ఆనందంగా ఉంది.

- సరస్వతి, మఠం

జగనన్నే పెళ్లి చేశారు



పేదింట పుట్టిన నాకు ఉన్నతవిద్యపై ఆసక్తి ఉన్నా చదువుకునే ఆర్థిక స్తోమత లేకపోయింది. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల నిధులతో నేను డిగ్రీ పూర్తి చేశాను. ఇదంతా సీఎం జగనన్న చలువతోనే జరిగింది. నాలుగు నెలల కిందట నాకు పెళ్లి జరిగితే ఖర్చుల కోసం వైఎస్సార్ కల్యాణమస్తు ద్వారా మరో రూ.50 వేలు ఇచ్చారు. దీంతో నా తల్లిదండ్రులపై భారం తగ్గించడం నాకు ఆనందంగా ఉంది.

- స్వాతి, కడపల్లె

మభ్యపెట్టి కండువాలు కప్పారు



సదుం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు



మాట్లాడుతున్న శరవణ్‌కుమార్, గణేష్, శంకరతో ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

సదుం: బీసీవై అధినేత రామచంద్రయాదవ్ తమని మభ్యపెట్టి పుంగనూరులో తమకు ఆ పార్టీ కండువాలు కప్పారని పలువురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు తెలిపారు. పుట్టావారిపల్లెకు చెందిన రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, వై. రామ్మూర్తి, పెద్దబ్బ తదితరులు మాట్లాడుతూ తాము ఇటీవల పుంగనూరులో ఓ శుభకార్యానికి వెళ్లామన్నారు. అక్కడ ఓ వ్యక్తి వచ్చి గుడి నిర్మాణానికి వేరే వ్యక్తి వద్ద విరాళం తీసిస్తానని నమ్మబలికి తీసుకుపోయాడన్నారు. అతడి వెంట వెళ్లగా అతడు రామచంద్రయాదవ్ వద్దకు తీసుకుపోయి బలవంతంగా పార్టీ కండువాలు కప్పించారని చెప్పారు. తాము ఎప్పటి నుంచో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అనుచరులుగా ఉన్నామని, తామెన్నటికీ వేరే పార్టీలో చేరమని వారు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మభ్యపెట్టి పార్టీ కండువాలను కప్పడం సిగ్గుచేటన్నారు. రామచంద్రయాదవ్‌ను ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ప్రచార యావ తప్ప, అతనికి మరేమి పట్టదని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లప్ప, సర్పంచ్ శ్రీనివాసుల రెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, అన్నారెడ్డి, గురురెడ్డి పాల్గొన్నారు.

బీసీవై పార్టీలో చేరలేదు

పుంగనూరు: బీసీవై పార్టీ నాయకుడు రామచంద్ర యాదవ్ వాలీబాల్స్ తీసిస్తామని నమ్మించి, తమకు వారి పార్టీ కండువాలు వేసి పేపర్‌లో వేయించారని మంగళం గ్రామ యూత్ శరవణ్‌కుమార్, గణేష్, శంకర, శ్రీకాంత్, బాలాజీ, రాజేష్, మనోజ్‌లు ఆరోపించారు. మంగళవారం ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నాయకులు రామమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, సచివాలయాల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం వారు మాట్లాడారు. తాము వైఎస్సార్‌సీపీలోనే ఉన్నామని, మోసం చేసి, తమని అప్రతిష్టపాలు చేసేందుకు రామచంద్ర యాదవ్ కుట్రలు పన్ని ఇలా చేశారని తెలిపారు. తాము వైఎస్సార్‌సీపీలో ఉన్నామంటూ కండువాలు వేసుకుని సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వం చేస్తున్న సేవలకు రుణపడి ఉన్నామని, ఆ పార్టీని వదిలే ప్రసక్తే లేదని తెలిపారు.